హైదరాబాద్ వార్త





# ఆరుగురి దారుణ హత్య

-పోక్సో కేసు కక్షతో బాధిత బాలిక, కుటుంబ సభ్యులతోపాటు భార్య, ఇద్దరు చిన్నారుల హత్య
-బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ప్రతిపక్ష నేతల అడ్డగింత



భరోసా కల్పిస్తున్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

**హైదరాబాద్ జూలై 11, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఆరుగురి హత్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. పోక్సో కేసులో తనపై ఫిర్యాదు చేశా రనే కక్షతో యాంటిసిపేటరీ బెయిల్‌పై ఉన్న రాజ్‌కుమార్ (28) అత్యంత దారుణంగా ఆరుగు రిని హత్య చేసిన ఘటన రెండు గ్రామాలను విషాదంలో ముంచెత్తింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మే 16న ఓ మైనర్ బాలి కపై లైంగిక దాడి చేసిన కేసులో రాజ్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అనం తరం అతడు యాంటిసిపేటరీ బెయిల్ పొందా డు. తనపై కేసు నమోదు చేయించారనే కక్షతో శనివారం తెల్లవారుజాము న ముందుగా దైవాల గూడ గ్రామంలోని తన ఇంట్లో భార్య పార్వతి సరిత (30), కుమారులు పరీక్షిత్ (3), దైవీక్షిత్ (2)లను హత్య చేశాడు. అనంతరం షాబాద్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన చిట్యాల లక్ష్మి (45), ఆమె అత్త రుక్కమ్మ (65)లను కత్తితో హత్య చేశాడు. తర్వాత బాధిత మైనర్ బాలిక అక్షయ (17)ను దైవాల గూడ సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపా రు. హత్యల అనంతరం తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని హత్య చేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటా నని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు సమాచా రం. సమాచారం అందుకున్న పోలీసు లు వెం టనే సంఘటనా స్థలాలకు చేరుకుని మృ తదే హాలను పోస్టుమార్టం నిమిత్తం తరలిం చారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

**పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..**

పోక్సో కేసు నమోదైనప్పటికీ నిందితుడిపై తగి న నిఘా పెట్టలేదని ఆరోపిస్తూ బాధిత కుటుం బ సభ్యులు, గ్రామస్తులు షాబాద్ ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. నిందితు డిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడే వరకు ఆందోళన విరమించబో మని స్పష్టం చేశారు. రాస్తారోకోలో పట్నం అవినాష్ రెడ్డి, బర్క కృష్ణ, రాము, తమ్మలి రవీందర్, వెంకట్ యాదవ్, జడల రాజేందర్ గౌడ్, రాహుల్ గుప్తా, దేవేందర్ రెడ్డి, గౌరీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలు షాబాద్ చౌరస్తాలో హృదయ విదారకంగా మారాయి. ఘటనా స్థలంలో ఉన్నతాధికారుల పర్యవేక్షసంఘటన స్థలాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. జాయింట్ సీపీ చందన దీప్తి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌత మ్, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనా రాయణ, ఇతర పోలీసు అధికారులు, క్లూస్ టీం సభ్యులు ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యా ప్తును పర్యవేక్షించారు. చేవెళ్ల ఆర్డీవో పార్థసారధి రెడ్డి కూడా సంఘటనా స్థలాన్ని సంద ర్శించారు.

**ప్రతిపక్ష నేతల అడ్డగింత..**

బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిలను పోలీసులు చేవెళ్లలోనే అడ్డు కుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

# జోరుగా ఆషాడ బోనాల జాతర ఏర్పాట్లు



ఆలయంలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి టికెట్లు కొనుగోలు చేస్తున్న మహిళలు.

-శనివారం రోజు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
-ఆధునిక టెక్నాలజీతో టికెట్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



**బేగంపేట జులై 11,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ లోని చారిత్రాత్మకమైన శ్రీఉజ్జయినీ మహకాళీ అమ్మ వారు ఎంతో మహోన్నతమైన మహిమ గలిగి ,జంట నగరాల వాసులకు ఆరాధ్య దేవతగానూ,ఇలవేల్పుగాను విరాజిల్లుతుంది. ప్రతి ఏటా ఆషాడ మాసం మొదటి ఆదివారం ఘటోత్సవం ,ఘటం ఊరేగింపులు పదిహేను రోజులు నిర్వహిస్తారు.మూడవ ఆదివారం బోనాలు,మహాహారతి సమర్పణ,అనంతరం రంగం (భవిష్యవాణీ) కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.లష్కర్ బోనాల జాతరంటేనే సికింద్రాబాద్ ప్రాంతంలో ఎంతో ప్రత్యేకత నెలకొంటుంది.ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో లష్కర్ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్తలు (ఏర్పాట్లు) చేస్తున్నారు.ఈ నెల 19న ఘటోత్సవం (ఎదుర్కోలు)తో బోనాల జాతరకు అంకురార్పణ జరగనుంది.ఆగస్టు 2న ఉదయం గం 4ల నుంచి బోనాలు,సోమవారంగం 8.30నిలకు రంగం (భవిష్యవాణి)తదనంతరం గజాధిరోహణ మహోత్సవం ఉదయం గం 10లకు అంబారీపై అమ్మ వారి ఊరేగింపు అత్యంత వైభవంగా నేత్ర పర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో దేవదాయ శాఖతో పాటు అన్ని ముఖ్య శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులను అప్రమత్తం చేసారు.రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ డీసీపీ రక్షితా మూర్తి ఆధ్వర్యంలో రక్షణ పరంగా చేపట్టాల్సిన చర్యలతో పాటు ఆలయ ప్రాంగణంలో తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే ఆలయానికి 14 మందితో రెండేళ్ల కాలపరిమితితో ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసారు.వారి ప్రమాణ స్వీకార కార్యక్రమం కూడా జరిగింది. మరోవైపు ఆలయ గోపురానికి, ఆలయం, లోపల,బయట రంగులు వేసే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది.ఇంకోవైపు విద్యుత్‌లైట్ల ఏర్పాటు కోసం చేపట్టాల్సిన చర్యలు,ఆలయ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.ఘటోత్సవానికి ముందే ఏర్పాట్లను పూర్తి చేయాలనే ఆలోచనలో యంత్రాంగం పనులను శరవేగంగా నిర్వహిస్తుంది.ఒక వైపు ఏర్పాట్లు చురుగ్గా సాగుతుండగా మరో వైపు ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతుంది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వయోవృద్దులు,బాలింతలు,శివసత్తులు అమ్మ వారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.జంట నగరాలతో పాటు దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున అమ్మ వారి జాతరకు తరలి రానుండటంతో భారీ భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు,ప్రతి ఒక్క భక్తునికి అమ్మ వారి దర్శనాన్ని అందించేందుకు అన్ని రకాలైన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.మనోహార్ రెడ్డి తెలియజేసారు.

**ఆధునిక యంత్రాల(ఆన్‌లైన్ టికెటింగ్)తో అమ్మ సేవలు....**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో భక్తులకు వీలైనంత వేగంగా సేవలను అందించేందుకు ఆన్‌లైన్ టికెటింగ్ యంత్రాల (మిషిన్ల)ను ఏర్పాటు చేసారు.దీనిద్వారా భక్తులకు కావాల్సిన దర్శనం,ఇతర సేవల టికెట్లతో పాటు అన్నదానం,ఇతరత్రాలకు సంబంధించి కూడా ఆ మిషిన్లను భక్తులు వినియోగించుకుం టున్నారు. ఈ మిషన్లు అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్ పేమెంట్ వినియోగించుకునే వారు వీటి ద్వారా టికెట్లను పొందుతున్నారు.దీంతో సమయం ఆదా అవుతుంది.

**తిరుమల తరహాలో ఆలయానికి లైటింగ్ ఏర్పాట్లు...**

ఈ ఏడాది ఆషాడ బోనాల కు శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం నూతన శోభను సంతరించుకోనుంది.గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటిసారిగా అమ్మ వారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయం అంతటికి తిరుమల తరహాలో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు వివిధ రకాలైన పూలతో వినూత్నమైన అమ్మ వారి ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కురిసిన ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి

-ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలి
-వర్షపు నీటి సంరక్షణ ప్రతి అపార్ట్‌మెంట్ బాధ్యత
-జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి



గుట్టల బేగంపేటలో ఇంజక్షన్ బోర్ వెల్‌ను ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి.

**హైదరాబాద్ జులై 11 ప్రభాతవార్త**

నగరంలో పెరుగుతున్న తాగునీటి అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి బాధ్యతగా స్వీకరించాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుట్టల బేగంపేటలోని బీవర్లీ హిల్స్‌లో ఇంకుడు గుంతను డ్రిల్లింగ్ చేసి ఇంజెక్షన్ బోర్‌గా మార్చిన రీచార్జ్ వ్యవస్థను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను కేవలం భవన నిర్మాణ అనుమతులు లేదా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందడం కోసమే నామమాత్రంగా ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. ప్రతి భవనం పైకప్పుపై కురిసే వర్షపు నీటి ప్రతి చుక్కను అదే ప్రాంగణంలో భూమిలోకి ఇంకేలా శాస్త్రీయంగా రూఫ్‌టాప్ రేన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్లు నిర్మించాలని సూచించారు.

**ట్యాంకర్ బుకింగ్‌లలో భారీ పెరుగుదల...**

గత ఏడాది వేసవిలో సుమారు 4 వేల అపార్ట్‌మెంట్లు జలమండలి ట్యాంకర్ నీటిని వినియోగించగా, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 12,500 అపార్ట్‌మెంట్లకు పెరిగిందని ఎండీ తెలిపారు. వర్షాలు కురుస్తున్న రోజుల్లోనూ కొన్ని ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ట్యాంకర్ బుకింగ్‌లు నమోదవుతున్నాయని చెప్పారు. గతంలో అయ్యప్ప సొసైటీ, కూకట్‌పల్లి, ఎస్.ఆర్.నగర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉండేదని, ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డిమాండ్ తగ్గినప్పటికీ, సాధారణంగా నీటి సమస్య తక్కువగా ఉండే ఉప్పల్, ఎల్‌బీనగర్, ఎన్‌టీఆర్‌నగర్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో డిమాండ్ అనూహ్యంగా పెరిగిందన్నారు. వర్షాలు ఆలస్యంగా కురవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, బోర్లు ఎండిపోవడం ఇందుకు ప్రధాన కారణాలని వివరించారు.

**జనాభాకు అనుగుణంగా వసతులు...**

గతంలో 300 గజాల స్థలంలో ఒక కుటుంబం నివసించగా, ప్రస్తుతం అదే విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి అనేక కుటుంబాలు నివసిస్తున్నాయని,దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి అవసరం అనేక రెట్లు పెరుగుతోందన్నారు .హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి తదితర దూరప్రాంత జలవనరుల నుంచి అనేక దశల్లో నీటిని పంపింగ్ చేసి తీసుకువస్తున్నామని చెప్పారు. ఇందుకు భారీ విద్యుత్ వ్యయం, పంపింగ్ స్టేషన్లు, ప్రధాన పైప్‌లైన్లు, నిరంతర పర్యవేక్షణ అవసరమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ రీజినల్ ఈడీ సంతోష్, డైరెక్టర్ (ఆపరేషన్స్) నారాయణ, జీఎం హరిశంకర్, ఇంకుడుగుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ముషీరాబాద్ కేంద్రాలలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ తనిఖీ



వివరాలు అడిగి తెలుసుకుంటున్న తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్

**చిక్కడపల్లి జూలై 11 ప్రభాతవార్త :**

ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాలలో సాగుతున్న ఎస్ఐఆర్ గణన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను శనివారం రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తనిఖీ చేసింది. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ , జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (ఎన్నికలు) సంయుక్తంగా నియోజకవర్గంలోని వాలీబాల్ గ్రౌండ్ ప్రాంగణం, తలబస్తీ కమ్యూనిటీ హాల్‌లలోని కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా డిజిటలైజేషన్ ప్రక్రియ పనితీరును, డేటా ఎంట్రీ క్వాలిటీని అధికారులు నిశితంగా పరిశీలించారు. కేంద్రాల్లో కంప్యూటర్ల ఏర్పాటు, ఇంటర్నెట్, సిబ్బందికి కల్పించిన మౌలిక సదుపాయాలు మరియు వినియోగించుకుంటున్న మానవ వనరుల లభ్యతపై అంచనా వేశారు.అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో అధికారులు ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. డేటా నమోదులో ఎలాంటి చిన్న పొరపాట్లకు తావులేకుండా, అత్యంత కచ్చితత్వంతో దోషరహిత డిజిటలైజేషన్‌ను పూర్తి చేయాలని అధికారుల బృందం సిబ్బందిని ఆదేశించింది. కాలపరిమితి లోపు పనులన్నీ పూర్తి కావాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని ఉద్ఘాటించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో స్థానిక నియోజకవర్గ ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# కళలు దైవ దేశభక్తిని పెంపొందింపజేస్తాయి

: ప్రముఖ హాస్యబ్రహ్మ శంకర నారాయణ



సత్కారగ్రహీతలైన కళాకారులతో శంకరనారాయణ, రమ్యానాయుడు, కె.వి.రమణారావు, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూలై 11 ప్రభాతవార్త :** భారతీయ కళలు మనలో దైవభక్తి, దేశభక్తిని పెంపొందింపజేసి సన్మార్గంలో పయనింపజేస్తాయని ప్రముఖ హాస్య బ్రహ్మ, సీనియర్ పాత్రికేయుడు శంకర నారాయణ అన్నారు. కళాకారులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక తత్వాన్ని వివిధ శాస్త్రీయ, సంప్రదాయ. జానపద కళల ద్వారా విశ్వవ్యాప్తం చేస్తున్నారని ప్రశంసించారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్రీరాగరమన్య ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సంస్థ అధ్యక్షురాలు, నాట్యగురువు రమ్యానాయుడు నేతృత్వంలో, ఏబిసి ఫౌండేషన్ అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు పర్యవేక్షణలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన 160మంది చిన్నారి కళాకారుల కళాప్రదర్శనలతో వైభవోపేతంగా జరిగిన కార్యక్రమానికి శంకరనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని రాగరమ్య సంస్థ గత 8 సంవత్సరాలుగా 400లకుపైగా కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారని, అందులో 150 ఆధ్యాత్మికతను గుభాళింపజేస్తూ పుణ్యక్షేత్రాలైన తిరుమల, కాణిపాకం, శ్రీశైలం, కళాహస్తి, స్వర్ణగిరి దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించి ప్రజలను కళాలోకంలో ఓలలాడించారని రమ్యానాయుడిని ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాప్రదర్శనలు కావించిన కళాకారుల గురువులను, కళాకారులను ఘనంగా సత్కరించారు.

## చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న పాత నేరస్థుడి అరెస్ట్

**హైదరాబాద్, జులై 11, ప్రభాతవార్త**

చైన్ స్నాచింగ్లకు పాల్పడుతున్న పాత నేరస్థుడ్ని దుండిగల్ ఠాణా పరిధిలో పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వై. నాని అలియాస్ రాజు డి. పోచంపల్లిలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో నివాసం ఉంటూ వంటవాడిగా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్లకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే వారం రోజుల క్రితం సూరారం వద్ద ఓ మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కునేందుకు యత్నించాడు. మేడ్చల్ సీసీఎస్ పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి, గండిమైసమ్మ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు చేసిన చైన్ స్నాచింగ్లు బయటపడ్డాయి. అనంతరం నిందితుడిని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. అతని వద్ద ద్విచక్ర వాహనం, ఒక సెల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

**నిందితుడిపై మొత్తం 19 కేసులు**

2019 నుంచి నగరంలోని దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, సూరారంలో ఒకటి, పేట్‌బషీరాబాద్‌లో ఒకటి, కేపీహెచ్బీలో మూడు, బాలానగర్‌లో రెండు, జగద్గిరిగుట్టలో ఒకటి, చందానగర్‌లో ఒకటి, రాయదుర్గంలో ఒకటి, జీడిమెట్లలో రెండు, మాదాపూర్, మేడ్చల్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్లో ఒక్కొక్కటి చొప్పున అతనిపై కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిడదవోలు పోలీస్ స్టేషన్లో మరో కేసు నమోదైంది. నిందితుడిపై మొత్తం 19 కేసులు ఉన్నాయి.

# యాప్రాల్ జంక్షన్‌కు మహర్దశ..

-ప్రమాదాలకు చెక్‌ఫ్రీ లెఫ్ట్‌తో ట్రాఫిక్‌కు ఊరట..
-టీడీఆర్‌తో భూసేకరణకు వేగం
-క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**నేరేడ్‌మెట్ జూలై 11,ప్రభాతవార్త :** నిత్యం ట్రాఫిక్ రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో వాహనదారులకు ఇబ్బందిగా మారిన యాప్రాల్ జంక్షన్‌కు త్వరలోనే కొత్త రూపు రానుంది. ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేయడంతో పాటు ప్రమాదాలను పూర్తిగా నివారించేలా సమగ్ర అభివృద్ధి పనులకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ శనివారం యాప్రాల్ జంక్షన్, చంద్రగిరి కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో పాటు రహదారి మధ్యలో ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాన్స్‌మిషన్ టవర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించే అవకాశాలను సాంకేతికంగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. టవర్‌ను సమీపంలోని పార్కు ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన భూమి లభ్యత, యాజమాన్య అంశాలను పరిశీలించి, అవసరమైతే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానంలో భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.యాప్రాల్ జంక్షన్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మొత్తం 53 ఆస్తులు ప్రభావితమవుతుండగా, 6,833.72 చదరపు గజాల భూసేకరణ అవసరమవుతోందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. అలాగే 57 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు చెట్లను స్థాన మార్పు చేయాల్సి ఉంటుందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు అవసరమైన అంచనాలు వెంటనే సిద్ధం చేసి విద్యుత్ శాఖ అధికారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని, రహదారి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. యాప్రాల్ జంక్షన్ అభివృద్ధి పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సిటీ ప్లానింగ్ అధికారులు, విద్యుత్ శాఖ ప్రతినిధులు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 26న విజయవాడ కనక దుర్గమ్మకు బంగారు బోనం



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు

**చార్మినార్,జూలై 11 ప్రభాతవార్త :** భాగ్యనగర్ శ్రీ మహంకాళీ బోనాల జాతర ఉత్సవాల ఊరేగింపు కమిటి ఆధ్వర్యంలో జూలై నెల 26వ తేదీన విజయవాడ శ్రీ కనక దుర్గ అమ్మ వారికి సంప్రదాయ బద్దంగా బంగారు బోనంను సమర్పించనున్న సందర్భంగా విజయవాడ కనక దుర్గ దేవస్థానం బోర్డు సభ్యులు హరికృష్ణ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు మల్యాల మధు సూధన్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా బంగారు బోనం సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై కమిటి అధ్యక్షులు మధుసూదన్ యాదవ్‌తో హరికృష్ణ చర్చించారు.బంగారు బోనం సమర్పణ కార్యక్రమానికి సంపూర్ణమైన సహకారాన్ని అందిస్తామని హరికృష్ణ హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు గాజుల అంజయ్య, బుల్లెట్ శ్రీ ధర్,అనంతోజు హంసరాజ్,సతీష్ గౌడ్,శ్రీ కాంత్‌తో పా టు పలువురు పాల్గొన్నారు.

## ప్రతి ఓటర్ సర్ దరఖాస్తు పూర్తి చేసి ఇవ్వాలి



బిఎల్ఓ, బిఎల్ఎ అధికారులతో చర్చిస్తున్న మాజీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**బేగంబజార్, జులై 11(ప్రభాతవార్త:** ఓటు హక్కు కలిగిన ప్రతి ఒకరు తమ సర్ ధరఖాస్తు ఫారాలనునింపి సంబంధితల బిఎల్ఓ, బిఎల్ఎ అధికారులకు ఇవ్వాలని మాజీ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్‌అన్నారు. శనివారం తన కార్యాలయంలో బిఎల్ఓ, బిఎల్ఎ అధికారులతో చర్చించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ ఓటుహక్కు ప్రతి ఒకరు భాధ్యతగా భావించి, అంతేకాకుండా ప్రత్యేకంగా ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమాన్ని పురానాపూల్ డివిజన్‌లో నిర్వహిస్తున్నారు. ఎస్. ఐ. ఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)నిర్వహించారు. ఓటరు సర్ ఫారాలను పూర్తి చేయడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి సూచనల మేరకు ఓటర్ సర్ ధరఖాస్తు ఫారాన్ని పూర్తి చేయాలన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : కొలన్ హన్మంత్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, జులై 11, ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స కొనసాగించలేని బాధితులు తనను సంప్రదించగా, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సనది సోనీకి రూ.60 వేలు, పెంతోట వెంకటేశ్వర్లుకు రూ.37,500, బొండాడ రాజుకు రూ.60 వేలు, మరోజు పద్మకు రూ.41 వేలు, జులా స్రవంతికి రూ.60 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఊరటనిచ్చే పథకమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందలేని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ ఛైర్మన్ మన్నే రాజు, డీసీసీ ఉపాధ్యక్షుడు బుయ్యని శివకుమార్, డీసీసీ కార్యదర్శి ఎండి లాయక్, గణేష్, 285 డివిజన్ అధ్యక్షుడు గడ్డం స్వాతిక్ రాజేందర్ రెడ్డి, 277 డివిజన్ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, 296 డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత : బిక్షపతి యాదవ్



మొక్కలు నాటుతున్న దృశ్యం

**నిజాంపేట్, జులై 11, ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపు ప్రతి పౌరుడి బాధ్యత అని బిక్షపతి యాదవ్ అన్నారు. శనివారం నిజాంపేట సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ పార్క్‌లో లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఒరాకిల్ సంస్థ వాలంటీర్ల సహకారంతో పార్క్ పరిశుభ్రత, మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ వేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో నగరాలు కాంక్రీట్ అడవులుగా మారుతున్న నేపథ్యంలో, పార్కులను పరిశుభ్రంగా ఉంచి ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒరాకిల్ సంస్థ వాలంటీర్లు, నిజాంపేట సర్కిల్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి పార్కులో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పలు రకాల మొక్కలను నాటారు. ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం నిర్వహిస్తామని, ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని బిక్షపతి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఒరాకిల్ వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, యువత, మహిళలు, సామాజిక కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఒరాకిల్ సంస్థ వాలంటీర్లు, నిజాంపేట సర్కిల్ సిబ్బంది, కాలనీ సభ్యులకు లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ తరఫున బిక్షపతి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## అమ్మవారి ఘటం ఊరేగింపుకై అధికారుల పర్యవేక్షణ



సమావేశంలో పోలీస్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు..

**కార్వాన్, జులై11, ప్రభాతవార్త**

సబ్జిమండి ప్రాంతంలో జరిగే బోనాల ఉత్సవాల్లో అమ్మవారి ఘటం ఊరేగింపు అభారిపై అత్యంత వైభవంగా, సాంప్రదాయబద్ధంగా జరుగుతుంది. అమ్మవారి ప్రతిరూపమైన ఈ ఘటాన్ని ఏనుగు అంబారిపై ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపు నిర్వహిస్తారు. అందులో భాగంగా శ్రీ నల్లపోచమ్మ మరియు మహంకాళి దేవాలయ 104 వ బోనాల ఉత్సవాల పురస్కరించుకొని అంబారిపై అమ్మవారి ఘటం ఊరేగింపు పట్ల ప్రధాన రహదారులను పోలీసు ఉన్నత అధికారులు డి.సి.పి రాఘవేంద్ర రెడ్డి, అదనపు డి.సి.పి కృష్ణగౌడ్, ఏ.సి.పి తిరుపతి, కూల్సుంపురా సిఐ రాములు, టప్పాచబుత్ర సిఐ బాలకృష్ణ బృందం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి విజయవంతం చేయడానికి సహకరిస్తామని ఆలయ కమిటీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజా కమిటీ అధ్యక్షులు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి అల్లే రామ్ కుమార్, సలహాదారులు గుడబోయిన శివరత్నం ,సేనాపతి చంద్రశేఖర్, కట్ట నర్సింగ్ రావు, గుడుమని అశోక్ కుమార్, గాండ్ల నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక దోబీ ఘాట్ల ఏర్పాటుకు కృషి : ఛైర్మన్ దాసరి అజయ్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న రజక ఫెడరేషన్ ఛైర్మన్ దాసరి అజయ్

**ముషీరాబాద్, జులై 11, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతి నియోజకవర్గంలో జనాభాకు తగిన విధంగా ఆధునిక దోబీ ఘాట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రజక ఫెడరేషన్ ఛైర్మన్ దాసరి అజయ్ తెలిపారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్న దోబీ ఘాట్లను ఆయన తెలంగాణ రజకాభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మన్ ఎం. నర్సింహతో కలసి సందర్శించి, అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రజకాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ప్రతి నియోజకవర్గంకు రెండు ఆధునిక దోబీ ఘాట్లను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా అన్ని దోబీఘాట్లను సందర్శిస్తున్నామని తెలిపారు. రజక వృత్తికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి, వృత్తిని మరింత సులభతరం చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జనాభాను బట్టి అవసరమైన నియోజకవర్గంలో మరో దోబీఘాట్‌ను ఏర్పాటుచేసే విధంగా మరియు దోబీ ఘాట్‌లలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. 15 సంవత్సరాల తరువాత తనను రజక ఫెడరేషన్‌కు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించారని, అప్పటి నుంచి రజక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, దోబీఘాట్లను సందర్శించటం జరుగుతోందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రజక ఓట్లను దండుకుని, రజకుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రజక సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర నాయకులు జూపల్లి రాజశేఖర్, బి.చంద్రమోహన్, పి.కిషన్, పి.శ్రీధర్, హరినాథ్, ఎన్.రాజు, జే.నర్సింగరావు, ఎస్ఐ నర్సింగ్‌రావు, కే.నర్సింగరావు, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



**అత్తాపూర్ జులై11 ,ప్రభాతవార్త :** సమాజ రక్షణలో నిరంతరం శ్రమించే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బంది కొరకు మ్యాక్స్ విజన్ హాస్పిటల్ సహకారంతో భారీ ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్, ఎసిపి శ్రీనివాల ప్రోత్సాహంతో సిటీ పోలీస్ విభాగంలో నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తమ విధులను చురుగ్గా, ఆరోగ్యంగా మరియు శారీరక దృఢత్వంతో నిర్వహించేలా చూడటం, ముందస్తు ఆరోగ్య రక్షణ మరియు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుండె సంబంధిత పరీక్షలు (కార్డియాక్ హెల్త్ చెకప్) మ్యాక్స్ విజన్ నిపుణులచే అత్యాధునిక కంటి పరీక్షలు రక్తపోటు (బి.పి), బ్లడ్ షుగర్ పరీక్షలు ఇతర సాధారణ ఆరోగ్య సమస్యల నిర్ధారణ పరీక్షలు శిబిరంలో పోలీసు సిబ్బంది చేయించుకున్నారు. అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, వైద్యులు తగు ఆరోగ్య సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యమని, ఈ శిబిరం విజయవంతం కావడానికి ప్రోత్సహించిన డీసీపీ , ఏసీపీ,వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యమకారులకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే శ్రీగణేష్



తెలంగాణ ఉద్యమ కారులతో సమావేశమైన కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, జులై 11 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమ కారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారంపికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉద్యమ కారులతో సమావేశమై తమ అనుభవాలను పంచుకున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ కారులకు న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరుపున ఉద్యమ కారులకు గుర్తింపుకార్డులు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, పెన్షన్లతో పాటు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యమ కారుల డిమాండ్ల పరిష్కారానికి సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారులు గంధం దయామని, బొట్టు ప్రభాకర్, రంగ రవిందర్ గుప్త, అరుణ్ యాదవ్, ఓంప్రకాశ్ యాదవ్, ప్రభుగుప్త, సంకి రవిందర్, పెద్దాల నర్సింహ్మ, సత్య నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మొక్కలు నాటిన ఎమ్మెల్యే . . .**

కంటోన్మెంట్ 8వ వార్డు బొల్లారంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మొక్కలు నాటారు.

**జెఎసి నేతలను పరామర్శించిన ఎంపీ ఈటల**



తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసి నాయకులతో ఎంపీ ఈటెల రాజేందర్

**కంటోన్మెంట్, జులై 11 ప్రభాతవార్త:**

జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా శనివారం జేఏసి నిర్వహించిన ధర్నా కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా అఖిల పక్ష నాయకులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లలో నిర్బందించారు. విషయం తెలుసుకున్న ఎంపీ ఈటెల రాజేందర్ తుకారాంగేట్, బొల్లారం పోలీస్‌స్టేషన్లలో అరెస్టు అయినా జేఏసి నాయకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పిట్ల నాగేశ్ ముదిరాజ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**ఆదం సంతోష్‌కు ఎస్ఐఆర్ ఫారాలు అందజేత**



ఆదం సంతోష్‌కు ఎస్.ఐ.ఆర్.ఫారాలను అందజేస్తున్న తహశీల్దార్ అసదుల్లాఖాన్, డిసి జ్యోతి తదితరులు

**అడ్డగుట్ట, జులై 11 ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని కొండా రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్ కుమార్‌కు శనివారం ఎస్.ఐ.ఆర్. ఫారాలను మెట్టుగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి, మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్, బి.ఎల్.ఓలు రాజేందర్, సతీష్‌ల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంట రాజు సాగర్ పాల్గొన్నారు.

## కాపులకు పదవి ఇచ్చిన తరువాతే మద్దతు కోరాలి : చిన్నయ్య దొర

**సైఫాబాద్, జులై 11 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ నాయకులు వాస్తవాలకు విరుద్ధంగా కాపు సామాజిక వర్గానికి హామీలను గుప్పించడం తగదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ మాజీ అధ్యక్షుడు, బిజెపి నాయకుడు గొరకపూడి చిన్నయ్య దొర చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో సిఎం పదవి కాపు సామాజిక వర్గానికి కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ చేసిన వ్యాఖ్యల పట్ల చిన్నయ్య దొర ఆగ్రహం వ్యక్తం చేశారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కాపులు సంపూర్ణంగా మద్దతు ఇచ్చారని ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చిన కాంగ్రెస్ పార్టీ కాపులను ఏమాత్రం పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, కాపు ఉద్యమ నాయకుడు మిరియాల వెంకట్రావుకు మాత్రం హస్తకళల కార్పోరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పెరంబదూర్ వెళ్తూ విశాఖపట్నం విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ కాపు నేత వి.హనుమంతరావుకు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చినా ఆయన మరణంతో హామీ నేరవేరలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో సిఎం పదవి కాపులకు ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడు కాపులంతా కాంగ్రెస్ పార్టీని నమ్మి ఏపిలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. సిఎం పదవి కాపులకు కేటాయించిన తరువాత మాత్రమే కాంగ్రెస్ పార్టీ కాపుల మద్దతు కోరాలని చిన్నయ్య దొర సూచించారు.

**విద్యార్థులకు హెక్సిస్, ఐరిస్ పరికరాల పంపిణీ**



హెక్సిస్, ఐరిస్ పరికరాలతో అంధ విద్యార్థులు, ఆయా సంస్థల ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జులై 11, ప్రభాతవార్త :**

హైదరాబాద్ రియల్‌పేజ్, యునైటెడ్ వే, విజన్ ఎంపవర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దారుల్‌షిఫా ప్రభుత్వ అంధ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు హెక్సిస్, ఐరిస్ సహాయక విద్యా పరికరాలను పంపిణీ చేశారు. విజన్ ఎంపవర్ సంస్థ ప్రతినిధులు దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు అందుబాటులో ఉండే విద్యను అందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. హెక్సిస్, ఐరిస్ పరికరాలు విద్యార్థుల స్వతంత్ర అభ్యాసాన్ని ఎలా పెంపొందిస్తాయో తెలిపారు. విద్యార్థులు హెక్సిస్, ఐరిస్ పరికరాలను ఉపయోగించి ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. రెండు పరికరాల పనితీరును విద్యార్థులే స్వయంగా వివరించి, తమ అభ్యాసంలో వాటి ఉపయోగాన్ని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రియల్‌పేజ్, యునైటెడ్ వే, విజన్ ఎంపవర్ సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ రియల్‌పేజ్ ప్రతినిధులు వారికి టీషర్ట్లు, క్యాప్‌లను బహూకరించారు. ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ఉపాధ్యాయురాలు సద్గుణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండడి వెంకట్ రెడ్డి, రియల్‌పేజ్, యునైటెడ్ వే, విజన్ ఎంపవర్ ప్రతినిధులు మీరా, సాయి నిఖిత, అశ్విని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదవాడి కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట, జులై 11ప్రభాతవార్త:**

ఆకలి మంటలతో అలమటిస్తున్న పేదవాడి కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సికింద్రాబాద్ ,రెజిమెంటల్ బజార్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 5 రూపాయలకే నాణ్యమైన, రుచికరమైన అల్పాహారాన్ని పేదలకు ఇందిరమ్మ క్యాంటీన్ ద్వారా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్, అల్లాడి గౌరి శంకర్, నందికంటి రవి, నాగేశ్ యాదవ్, పెద్దాల నర్సింహ్మ, సి.సంతోష్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, బొట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి : ఆర్. కృష్ణయ్య



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**చిక్కడపల్లి జులై 11 (ప్రభాతవార్త ) :** రాష్ట్రంలోని 14 లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నెం.9ను రద్దు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ విద్యార్థుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో 150 కొత్త బీసీ గురుకుల పాఠశాలలు, 120 బీసీ కళాశాల హాస్టళ్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ పరిమిత సీట్ల కారణంగా వేలాది మంది విద్యార్థులు అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎస్ఎస్‌సీ ఫలితాల్లో బీసీ గురుకులాలు 99 శాతం ఉత్తీర్ణత సాధించడంతో వీటిపై మరింత ఆదరణ పెరిగిందన్నారు. ప్రతి ఇంటర్ కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున సీట్లు కల్పించి, ప్రస్తుతం ఉన్న 80 సీట్లను 160కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలు ప్రారంభమైనప్పటికీ హాస్టల్ సీట్లు అందక వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ హాస్టళ్ల ఫీజులు భరించలేక కొందరు చదువులు మానేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, మేడ్చల్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో కొత్త బాలురు, బాలికల హాస్టళ్లను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల కోసం కొత్త సంక్షేమ పథకాలు తీసుకురాకపోగా, కొనసాగుతున్న పథకాలను కూడా నిలిపివేస్తోందని ఆర్. కృష్ణయ్య విమర్శించారు. గత ముఖ్యమంత్రులు బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమం కోసం గురుకులాలు, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష, 16న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థుల డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

## మానవ సంబంధాల సంక్షోభానికి భాష, సాహిత్యాల నిర్లక్ష్యమే కారణం : ప్రొఫెసర్ హరగోపాల్



సమావేశంలో ప్రసంగిస్తున్న శాసనమండలి సభ్యుడు గోరేటి వెంకన్న

**చిక్కడపల్లి జులై 11 (ప్రభాతవార్త ) :** సమాజంలో భాషను, సాహిత్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా మానవ సంబంధాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నాయని ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బాషా ఉపాధ్యాయ వేదిక కన్వీనర్ బైరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. సమాజంలో మానవీయ విలువల నిర్మాణానికి భాష, సాహిత్యం ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కేవలం సాంకేతిక, ఆర్థిక రంగాలకే పరిమితం కాకుండా, అన్ని రంగాల్లోనూ భాషా సాహిత్యాల ఆవశ్యకత ఎంతైనా ఉందని హరగోపాల్ స్పష్టం చేశారు. మనుషుల మధ్య బంధాలను, సంస్కారాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాషను, సాహిత్యాన్ని ఆదరించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. శాసనమండలి సభ్యుడు గోరెటి వెంకన్న మాట్లాడుతూ మానవ సమాజంలో భాష అనేది కేవలం ఒక భావప్రకటన సాధనం లేదా వాహకం మాత్రమే కాదని, అది మన జీవన విధానానికి, తాత్విక ఆవరణకు ప్రతిబింబమని అభిప్రాయపడ్డారు. ప్రతి భాషకూ ఒక స్వయం ప్రతిపత్తి ఉంటుందని, అది సమాజ సంస్కృతిని, సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందిస్తుందని పేర్కొన్నారు. భాష పట్ల అవగాహన ఉండటం ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. డిగ్రీ కళాశాలల్లో భాషా బోధనను పూర్తిస్థాయిలో తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, దీనివల్ల తెలంగాణ సంస్కృతి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ ఛైర్మన్ డాక్టర్ నదిని సిదారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలను, సమాజం పట్ల అవగాహనను పెంపొందించడంలో భాషలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అలాంటి భాషా బోధన ప్రాధాన్యతను తగ్గించేలా క్రెడిట్లను కుదించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఉన్నత విద్యామండలి వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, డిగ్రీలో భాషల బోధన యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలుగు బాషా కనుమరుగు అవకుండా ప్రతిఒక్కరు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ కె.వెంకటనారాయణ అన్నారు. సభలో ప్రముఖ రచయిత డాక్టర్ ఎస్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం...



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 11, ప్రభాతవార్త**

కూకట్‌పల్లిలోని మూసాపేట ఆంజనేయనగర్ కాలనీవాసుల ఆహ్వానం మేరకు కాలనీ బైలా, కాలనీ ఎన్నికలు, ఇతర స్థానిక సమస్యలపై బండి రమేష్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిరంకుశ వైఖరితో గత 15 సంవత్సరాలుగా ఎన్నికలు జరగనివ్వకుండా అడ్డుపడుతున్నవారిని రమేష్ సూచనలతో కాలనీ సభ్యులు చెక్ పెట్టారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ త్వరలో ప్రజాస్వామ్యబద్ధంగా జరగబోయే కాలనీ ఎన్నికలకు తనవంతు సహాయం అందిస్తానని, ఇతర సమస్యలు కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయ నగర్ కాలనీ వాసులు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో బండి రమేష్‌ని కలిసి తమకు అండగా నిలబడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సునీల్ యాదవ్, ఆనంద్, శ్రీనివాస్, మూర్తి, రంజిత, లత కాలనివాసులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం



నులిపురుగుల నిర్మూలనా దినోత్సవంపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఈవో సుమన్

**చాంద్రాయణగుట్ట, జులై 11, ప్రభాతవార్త :**

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 13న జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని (నేషనల్ డీ వార్మింగ్ డే-ఎన్‌డిడి) నిర్వహించనున్నట్లు బహదూర్‌పురా జోన్ డిప్యూటీ ఈవో ఆర్. సుమన్ తెలిపారు. శనివారం బేలాచందూలాల్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నులిపురుగులు, ఆల్బెండజోల్ 400 ఎం.ఎం మాత్రల గురించి వివరించారు. ఆ రోజు ఒకటి నుండి 19 సంవత్సరాల బాలబాలికలకు ఆల్బెండజోల్ 400 ఎం.ఎం.మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మాత్రలు వేసుకునే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పేర్కొన్నారు. అదేవిధంగా యుడైస్‌లో విద్యార్థులను చేర్చటం, తొలగించటం, విద్యార్థుల ఆధార్ అప్డేషన్, అపార్ జనరేషన్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పురా డిప్యూటీ ఐఒఎస్ ఎస్.నరేందర్ యాదవ్, ఉందాబజార్ జీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కె.యాదగిరి, ఉపాధ్యాయులు శ్రీవాణి శ్రీనాథ్, ఆర్.రవికాంత్, సలీం, మొయినుద్దీన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి కాలనీలో ఎన్యుమరేషన్ హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేస్తాం: శాంతి సాయిజెన్**



**నాచారం, జులై 11 ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని నాచారం మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ పిలుపునిచ్చారు. శనివారం బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) అలేఖ్య నాచారంలోని శాంతి సాయిజెన్ నివాసానికి వెళ్లి ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా శాంతి సాయిజెన్ మాట్లాడుతూ, ఎన్ని పనులు ఉన్నా పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని ఎన్యుమరేషన్ ఫారం పూర్తి వివరాలతో నింపి బీఎల్ఓకు అందజేయాలని కోరారు. ఇలా చేయడం ద్వారా ఓటరు జాబితాలో పేరు కొనసాగి ఓటు హక్కు సురక్షితం గా ఉంటుందని తెలిపారు. ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు పార్టీ ఆధ్వర్యంలో త్వరలోనే ప్రతి కాలనీలో ఎన్యుమరేషన్ హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, ఫారాలను నింపడంలో అవసరమైన సహాయాన్ని అందిస్తామని ఆమె వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌గా మధుబాబు

**చిక్కడపల్లి, జులై 11 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ గా ఎల్. మధుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమీషనర్ వి.సి. సజ్జన్నార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన ఎం. మల్లేశంను సి.సి.సి అటాచ్‌మెంట్ ద్వారా ముఖ్యమంత్రి నివాస భద్రతా అధికారిగా బదిలీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఎల్. మధుబాబు సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ)గా తన ప్రస్థానాన్ని ప్రారంభించి, పలు ప్రాంతాల్లో సమర్థవంతంగా సేవలందించారు. తొలుత తిరుమలగిరిలో పనిచేసిన ఆయన, ఆ తర్వాత నల్గొండ జిల్లా కనగల్, ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ విభాగం, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, తుర్కపల్లి పోలీస్ స్టేషన్లతో పాటు రాచకొండ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్‌లో విధులు నిర్వ హించారు. పదోన్నతి (ప్రమోషన్) పొందిన అనంతరం తిరుమలగిరి ట్రా ఫిక్ ఇన్స్పెక్టర్ గా, ఆ తర్వాత చిలకల గూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్ర స్తుతం బదిలీపై చిక్కడపల్లి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా నియమితులయ్యారు.

**IN THE COURT OF THE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S No. 1546 Of 2025**

**Between:**
STATE BANK OF INDIA, Himayatnagar Branch, H.No.3-53906, Himayatnagar 'X' Roads, Hyderabad, Telangana. Rep. by its Chief Manager.
**...PLAINTIFF**

**And**
Mr. Peddagoni Chandra Shekar, S/o. Venkulu, Aged about 45 Years, Occu: Field Worker, DMHO Office, Suryapet, Emp Code: 1906279, R/o H. No.8-1-238/1, Road No.2, Rahamath Nagar, Yusufguda Hyderabad, Telangana - 500 045, Also at R/o 1-1-119, Hanuman Nagar, Suryapet, Telangana - 508 213
**...DEFENDANT**

Whereas SBI, Himayatnagar Branch, the plaintiff has instituted a suit against you for recovery of money, in the above-mentioned court at Hyderabad. The suit is posted on **19.08.2026.**

You are hereby informed to appear either in person or by pleader before the Hon'ble **V Senior Civil Judge,** City Civil Court at Hyderabad on **19th August, 2026 at 10.30 AM,** failure to appear in the court the matter will be decided Ex-parte.

**// By order of the court //**
**M/s AJGAL RAVI BABU (TS1008/90)**
**K. Prabhu Kumar, ADVOCATES**
No. 1-8-702/35A, 601, 6th floor, Windsor Plaza, Near Shankarmutt Nallakunta, Hyderabad -500044

వార్త CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

**SITUATION VACANT**
★ Wanted CCTV, Biometric techinicians With / without Experience with two wheeler
Contact - 9849053521
(Ro.No.14565)

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## వేగవంతంగా ఓటర్ ఎన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియ : జోనల్ కమిషనర్ సత్యనారాయణ



ఓటర్ ఎన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ సత్యనారాయణ డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ తదితరులు

**మలక్ పేట, జూలై 11,ప్రభాతవార్త:** ఓటర్ ఎన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని సౌత్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మలక్ పేట సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో జోనల్ కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ తదితరులు ఓటర్ ఎన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ సౌత్ జోన్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందని వివరించారు. ఓటర్లు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ మాట్లాడుతూ మలక్ పేట సర్కిల్ పరిధిలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మలక్ పేట సర్కిల్ పరిధిలో ఓటర్ ఎన్యుమరేషన్ ఫా మ్స్ డిజిటలైజేషన్ కార్యక్రమం విస్తృతంగా కోనసాగుతుందని వివ రించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలే మార్గం: ఏఐటియుసి



**నేరేడ్ మెట్, జులై 11,ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఏఐటియుసి నాలుగో మహాసభలు అల్వాల్ మండలం యాప్రాల్ పట్టణంలో జిల్లా అధ్యక్షుడు కె. స్వామి అధ్యక్షతన నిర్వహించారు.ఈ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాష్ట్ర ఏఐటియుసి ఇన్‌చార్జి బోస్, జిల్లా గౌరవ అధ్యక్షులు రవిచంద్రన్, శంకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు దీర్ఘకాల పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులను బలహీనపరుస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం ప్రశ్నించే వారిపై వివిధ రూపాల్లో ఒత్తిళ్లు తీసుకువస్తున్నారని ఆరోపించారు.రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.పెద్ద పెట్టుబడి దారులకు అనుకూల విధానాలు అవలంబిస్తూ, సామాన్య ప్రజలపై పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని మోపడం బాధాకరమని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కుల సాధన కోసం పోరాడాలని, భవిష్యత్ ఉద్యమాల్లో ప్రతి కార్మికుడు భాగస్వామి కావాలని ఏఐటియుసి శ్రేణులకు పిలుపునిచ్చారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించాలి

**కుషాయిగూడ, జులై 11, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను వెలికి తీసి ఆయా రంగాలలో తర్ఫీదు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని విజయ హై స్కూల్ కరస్పాండెంట్ కుప్పునూరు రాజేష్ పేర్కొన్నారు.విజయ హైస్కూల్లో ఘనంగా నిర్వహించిన ఖిఇన్వెస్టిచర్ సెరమనిఖి క్రమ శిక్షణ,దేశభక్తి,ప్రతిభకు ఆలవాలమైన విజయ హైస్కూల్, ఆదిత్య నగర్,కాప్రాలో హైస్కూల్ విద్యార్థుల చేత ఖిఇన్వెస్టిచర్ సెరమనిఖి కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా హైస్కూల్ స్థాయిలో బ్లూ,గ్రీన్, ఎల్లో,రెడ్ విభాగాల నుండి నాయకులుగా హైస్కూల్ విద్యార్థులను ఎన్నుకొని,వివిధ స్థాయిలుగా నియమించి వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు.నియామకం పొందిన విద్యార్థులు సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం కొనసాగించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరు రాజేష్ విద్యార్థులకు ధ్వజాలను అందించి,వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.."క్రమశిక్షణ లేని చదువు చుక్కాని లేని నావ లాంటిది,విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం.అవి నాణేనికి బొమ్మ బొరుసు లాంటిద"ని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొప్పునూరు వీణ,ప్రిన్సిపల్ డి.వి. బాబు,ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మల్లయ్య గుప్తాకు సన్మానం



ట్రస్ట్ సభ్యులు ఉండమల్లెలు సన్మానిస్తున్న దృశ్యం...

**కుషాయిగూడ, జూలై 11, ప్రభాతవార్త...** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా నియమితులై నేడు ప్రమాణ స్వీకారం చేసిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త గుండ మల్లయ్య గుప్తా కు బాలాజీ టెంపుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ సాయి అన్నపూర్ణ ఆర్య వైశ్య నిత్యాన్నదాన సత్రం షిరిడి తులసి భవన్ పీఆర్ఓ,కాసం వెంకట హరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కాచం వెంకట హరి మాట్లాడుతూ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుండ మల్లయ్య గుప్తా ను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం, ఆలయ అభివృద్ధి కోసం మల్లయ్య గుప్తా తన సేవలను అంకితం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.మల్లయ్య గుప్తా నాయకత్వంలో యాదగిరిగుట్ట క్షేత్రం మరింతగా అభివృద్ధి చెందాలని, స్వామివారి కృపతో ఆయనకు మరిన్ని ఉన్నత పదవులు లభించాలని కాసం వెంకట హరి ఆకాంక్షించారు.

# ప్రజా సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

**-మాస్టర్ ప్లాన్ రహదారుల తొలగింపు, కుదింపుతో పాటు సీఆర్ఎంపీ రోడ్లకు నిధులివ్వాలని వినతి**



**నేరేడ్ మెట్, జులై 11,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఐఏఎస్‌ను రసూల్‌పుర, బేగంపేట్‌లోని మెట్రో రైల్ భవనంలో కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న మాస్టర్ ప్లాన్ రహదారుల ప్రతిపాదనలను పునఃపరిశీలించాలని కోరడంతో పాటు నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.కౌకూర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 11, 35, 50, 56 పరిధిలో ఉన్న శ్యామల లక్ష్మీనగర్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, విలాస్ స్ప్రింగ్ కాలనీలపై ప్రభావం చూపుతున్న హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లోని 60 మీటర్ల ప్రతిపాదిత రహదారిని పూర్తిగా తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ప్రతిపాదన కారణంగా స్థానిక ప్రజలు, స్థల యజమానులు నిర్మాణ అనుమతులు, ఆస్తుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మీర్జల్‌గూడ-చిన్మయ మార్గ్ రోడ్డులో ప్రతిపాదించిన 60 అడుగుల రహదారిని 30 అడుగులకు కుదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి ప్రతిపాదనతో స్థానిక నివాసితులు, స్థల యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రజలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.కాకతీయనగర్ డివిజన్ పరిధిలో ఏఎస్‌రావునగర్ నుంచి నేరేడ్మెట్ వరకు ఏఎస్‌రావునగర్, సాయినాథ్‌పురం, జేకే కాలనీ, సమతానగర్, కాకతీయనగర్ ప్రాంతాల మీదుగా ప్రతిపాదించిన 100 అడుగుల రహదా రిని కూడా హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనతో వందలాది మంది ఆస్తి యజమానులు నష్టపోయే పరిస్థితి నెలకొన్నందున ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఇదే సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో సీఆర్ఎంపీ రహదారుల నిర్మాణ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రత్యేక వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే సమర్పించిన వినతిపత్రాలపై హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను సమగ్రంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# హెచ్‌పిఎస్‌లో ఘనంగా విద్యార్థి నాయకుల నియామకోత్సవం



హెచ్‌పిఎస్‌లో జరిగిన విద్యార్థి నాయకుల నియామకోత్సవంలో పాల్గొన్న పద్మశ్రీ డా.జి.వి.రావు, ప్రిన్సిపల్ డా.సల్లారం నరసింహారెడ్డి తదితరులు

**రామంతాపూర్, జులై 11 ప్రభాతవార్త :** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్‌లో శనివారం విద్యార్థి నాయకుల నియామకోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు కృష్ణ కోవిద్, విద్యార్థి నాయకురాలిగా కీర్తి కృష్ణజ విద్యార్థుల బృందానికి నాయకత్వం వహించగా త్రివిధ దళాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐజి ఆసుపత్రి డైరెక్టర్ పద్మశ్రీ డా.జి వి రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాచార్యులు డా. సల్లారం నరసింహారెడ్డి పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల నివేదికను సమర్పించారు, అనంతరం విద్యార్థి నాయకులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డా.జి వి రావు మాట్లాడుతూ నాయకత్వం అనేది సేవ చేయడానికి లభించిన గొప్ప అవకాశమని, విద్యార్థులందరూ క్రమశిక్షణతో లక్ష్య సాధన కోసం కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులను పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో తీర్చి దిగుతున్న పాఠశాల యాజమాన్యాన్ని కొనియాడారు. పాఠశాల ప్రాచార్యులు డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి మాట్లాడుతూ నాయకత్వం అంటే బాధ్యతాయుతమైన పదవే కాదు, తోటి వారితో కలిసి పనిచేయడం, సేవాభావం, నిబద్ధత అంకితభావం వంటి సద్గుణాలు కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ పి యస్ సొసైటీ అధ్యక్షులుగుస్తీ జె నోరియా గారు మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థిగా డా. జి వి రావు పద్మశ్రీ పురస్కారం పొందడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ పి ఎస్ అధ్యక్షుడు గుస్తీ జె నోరియా, ఉపాధ్యక్షుడు ఫయాస్ ఖాన్, శ్యాం మోహన్, వేణూ వినోద్, అశ్వనీకాంత్ రావ్, అమిత్ సింగ్, రాంమోహన్‌రావ్, బేతి సుభాష్‌రెడ్డి, మర్రి ఆదిత్యారెడ్డి, జె విక్రం దేవ్ రావ్, మసియుద్దిన్, రామసహాయం రఘురామిరెడ్డి, నిధి రెడ్డి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించి ఇవ్వాలి

**మహేశ్వరం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి**



ఎన్యూమరేషన్ ఫారాలు ఏ విధంగా పూరించాలనే విషయమై వివరిస్తున్న మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్ఓ),ఆర్‌డిఓ ఎన్.జగదీశ్వర్‌రెడ్డి: పక్కన ఎఇఆర్ఓ, డిసి సమ్మయ్య

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించి సంబంధిత బిఎల్ఓకు ఇవ్వాలని మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్ఓ), కందుకూరు ఆర్‌డిఓ ఎన్. జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్, ఎఇఆర్ఓ వి.సమ్మయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పురోగతి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరూ ఓటర్లుగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఎస్ఐఆర్ కార్యక్రమం జరుగుతున్నదని వెల్లడించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని 542 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఎస్ఐఆర్ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఎన్యూమరేషన్ ఫారాలు నింపి ఇచ్చే ప్రక్రియ జరుగుతోందనీ ఈ మేరకు అర్హులైన వారందరూ తప్పనిసరిగా ఫారాలను సక్రమంగా పూర్తించి బిఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించే బిఎల్ఓలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఒక ఉద్యమంగా సాగాలనీ ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారు సంబంధిత కేంద్రాల వద్దకు వచ్చి గానీ సదరు బిఎల్ఓలకు ఫోన్ చేసి వారి ద్వారా గాని తీసుకోవాలని ఆయన తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి హెల్ప్ డెస్కులు ఉన్నాయనీ వాటిని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ఇంకా విస్తృత ప్రచారం అవసరమనీ అదే విధంగా అందరి భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. ఎస్ఐఆర్ సందర్భంగా ఓటరు ఏ డాక్యుమెంట్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎన్యూమరేషన్‌లో వివరాలన్నీ సక్రమంగా ఇవ్వాలని ఆయన సూచించారు. అయితే ఎన్యూరేషన్ ఫారాలు ఎవరెవరు ఏయే కాలాలు నింపి ఇవ్వాలో ఆయన తెలియజేశారు. ఈ నెల 24వ తేదీ లోపు అందిన ఎన్యూమరేషన్ ఫారాలకు సంబంధించి ఎప్పటిప్పుడు డిజిటలైజేషన్ చేస్తారనీ జూలై 31వ తేదీ ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకటిస్తారని ఆయన వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్ డెస్కుల్లో గానీ బిఎల్ఓలు గానీ అధికారులు గానీ సాయం అందిస్తారని ఆయన తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రాధాన్యత గురించి అవగాహన చేసుకోవాలి : మాజీ కార్పొరేటర్ అర్జున్



ఎన్యూమరేషన్ ఫారాన్ని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సూర్ణగంటి అర్జున్

**సరూర్‌నగర్, జూలై 11 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రాధాన్యత గురించి ఓటర్లు అవగాహన చేసుకోవాలని బడంగ్‌పేట్ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ సూర్ణగంటి అర్జున్ కోరారు. శనివారం ఆయన బడంగ్‌పేట్ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటై ఉన్న ఎస్ఐఆర్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాలు పూరింపు, అందించే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం అర్జున్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చే 57, 61, 62 డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓలు అందుబాటులో ఉన్నారన ఈ నేపథ్యంలో ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకొని వాటిని పూరించి అందజేయాలని అన్నారు. ఫారాన్ని పూరించంలో ఏవైనా ఇబ్బందులు, సందేహాలు ఉంటే సంబంధిత బిఎల్ఓల సాయం తీసుకోవాలని సూచించారు. ఈ నెల 24వ తేదీలోపు ఫారాలను అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎ బొట్టు వెంకటేశ్, గోపాల్‌రెడ్డి, గణేష్, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ డివిజన్‌లో 'సర్'



'సర్' కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 11 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లో కొనసాగుతున్న 'సర్' కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగం మధుకర్‌రెడ్డి, ఏఇఆర్ఓ భాస్కర్‌రెడ్డి, ఇఆర్ఓ సుభాషిరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరుఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

### ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 11 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిటవరమని లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బృందావన్ కాలనీకి చెందిన గడ్డం యాదగిరి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అనంతరం రాజశేఖర్‌రెడ్డిని కలిసి తన ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరాడు. దీంతో వెంటనే స్పందించిన రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి చేత సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.60 వేల చెక్కును యాదగిరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో అండగా నిలుస్తుందని, ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు.

## సర్‌లో ఓటర్లు భాగస్వాములు కావాలి



సర్ పత్రాలను అందజేస్తున్న నిర్మలగణేష్‌నేత

**ఎల్.బి.నగర్, జులై 11 ప్రభాతవార్త:** సర్ కార్యక్రమంలో ఓటర్లు భాగస్వాములు కావాలని రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మలగణేష్‌నేత పేర్కొన్నారు. ఆర్కెపురం డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీలో బిఎల్ఓ, సూపర్వైజర్, ఏఈఆర్వోలతో కలిసి శనివారం ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఓటర్లకు వివరించడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించామని, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటును కాపాడుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నగర్ కాలనీ, ఎస్బిఐ కాలనీ, విజయపురి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక హిల్స్ అభివృద్ధికి కృషి చేస్తా



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న నూతన కమిటీ ప్రతినిధులు

**వనస్థలిపురం జూలై. 11.ప్రభాతవార్త.** ఉమ్మడి బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సిద్ధి వినాయక హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీ ఏర్పరచుకున్న సందర్భంగా శనివారం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడిని వారి కార్యాలయంలో కలిసి కాలనీ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని కోరారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి గారు మాట్లాడుతూ ఒకటొకటిగా అతి త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షులు సిద్ధా రెడ్డి, మాజీ అధ్యక్షులు గోవర్ధన్ , ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆదిలక్ష్మి రెడ్డి, జాయింట్ సెక్రటరీ మధు, భారతి, కార్యవర్గ సభ్యులు కృష్ణ, రామ్ రెడ్డి, మల్లికార్జున్ మరియు తదితరులు ఉన్నారు

### ఉద్యమకారుల ఐక్యతే లక్ష్యం: విష్ణువర్ధన్ రెడ్డి



**తుర్కయంజాల్, జులై 11,ప్రభాతవార్త** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల కమిటీతో ఈ నెల 13న జరగనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు, జేఏసీ ప్రతినిధులు, వివిధ ఉద్యమ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని అమర జ్యోతి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరై ఉద్యమకారులతో సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు.రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా సీనియర్ ఉద్యమకారుడు, ఇబ్రహీంపట్నం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జగదీష్ యాదవ్‌తో పాటు పలువురు ఉద్యమనాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### సర్ విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామికావాలి : ఆదం సంతోష్ కుమార్



సర్ పత్రాలను అందజేస్తున్న ఆదం సంతోష్ కుమార్ చిత్రంలో కిషోర్ యాదవ్

**తార్నాక, జులై 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు లాలాపేట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్ కార్యక్రమం ప్రజలకు చేరువ కావాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హెల్ప్ డెస్క్‌ల ద్వారా మార్గదర్శనం చేయాలని, సేవా దృక్పథంతో పనిచేస్తే పార్టీపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని చెప్పారు. సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ శివకుమార్, బ్రహ్మాజీ, రవి కుమార్, గోపి యాదవ్, సురేష్ గౌడ్, ప్రసాద్, ప్రదీప్ యాదవ్, విశాల్,సూర్య, రాజా నాయకులు, పాల్గొన్నారు.

### వైభవంగా సుదర్శన నారసింహ మహాయజ్ఞం



శ్రీసుదర్శన నారసింహా మహాయజ్ఞంలో స్థానిక ప్రజలు

**నాచారం, జులై 11 ప్రభాతవార్త :** మల్లాపూర్‌లోని తిరుమల మిలీనియం అపార్ట్‌మెంట్స్‌లో శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుమల వైఖానస ఆగమోక్త విధానంలో జరిగిన ఈ మహాయజ్ఞంలో ఐదుగురు వైఖానస ఆగమ పండితులు, శ్రీవారి పాదార్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు.భక్తులందరికీ సకల శుభాలు కలగాలని, సమస్త శత్రు నివారణ జరగాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వృద్ధి చెందాలని సంకల్పించి శ్రీ సుదర్శన నారసింహ అర్చన, మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా వైఖానస ఆగమ పండితులు రొంపిచర్ల బట్టార్ శ్రీనివాస స్వామి మాట్లాడుతూ శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహించడం ద్వారా శ్రీమన్నారాయణుడు, శ్రీ సుదర్శనుని విశేష అనుగ్రహం లభిస్తుందని తెలిపారు. ధర్మమార్గంలో నడిచే శక్తి, ఆధ్యాత్మిక చైతన్యం, సర్వ మంగళాలు ప్రసాదించే విశిష్ట యజ్ఞంగా దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని వివరించారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సుద ర్శన మహామంత్ర పారాయణం చేశారు. వేదఘోషలు, మంత్రోచ్ఛారణల మధ్య సాగిన ఈ ఆధ్యాత్మిక కా ర్యక్రమం భక్తులను భక్తిరసంలో ముంచెత్తింది. కార్యక్ర మం ముగిసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## అనయ డిగ్రీ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్.సయ్యద్ అలీ లుక్మాన్ హుస్సేన్.

**వనస్థలిపురం. జూలై.11.ప్రభాతవార్త** అనయ డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థుల కోసం శనివారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. సయ్యద్ అలీ లుక్మాన్ హుస్సైనీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసిస్తూ క్రమశిక్షణ, విలువలు, సేవాభావంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని సూచించారు.కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు విలువలతో కూడిన విద్యను అందించడమే కళాశాల లక్ష్యమని తెలిపారు.అతిథి వక్త పూర్ణశ్రీ బెజ్జంకి మాట్లాడుతూ, ఆత్మవిశ్వాసం, సమయపాలన, నిరంతర కృషి విజయానికి మూల సూత్రాలని పేర్కొంటూ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. రోజా రాణి కళాశాల విద్యా విధానం, క్రమశిక్షణ, హాజరు నిబంధనలు, పరీక్షల విధానం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ మార్గదర్శకత్వం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ జె. సాయిది రెడ్డి కళాశాల అకాడమిక్ క్యాలెండర్, విద్యార్థుల బాధ్యతలు, నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## డయాబెటిస్ డిటెక్షన్ కిట్ల పంపిణీ



**కుషాయిగూడ జూలై 11, ప్రభాతవార్త** లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320హెచ్ గ్లోబల్ కాజెస్ విభాగం ఆధ్వర్యంలో కుషాయిగూడ లయన్స్ భవన్లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న లయన్స్ క్లబ్‌లకు 50 డయాబెటిస్ డిటెక్షన్ కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గౌరవ అతిథులుగా, లయన్ డి. లింగా రెడ్డి, ఎమ్‌జేఎఫ్,ప్రథమ వైస్ జిల్లా గవర్నర్,లయన్ మనోహర్ రెడ్డి, పీఎంజేఎఫ్,జిల్లా ముఖ్య సలహాదారులయన్ కొత్త రామారావు, ఎమ్‌జేఎఫ్ - చైర్మన్, కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్,ప్రత్యేక ఆహ్వానితురాలిగా డాక్టర్ ఎన్. దేవి సుష్మ,ఈ కార్యక్రమానికి లయన్ కొత్తపల్లి రాంబాబు, పీఎంజేఎఫ్, జిల్లా కార్యదర్శి - గ్లోబల్ కాజెస్ కన్వీనర్‌గా వ్యవహరించారు.ఈ సందర్భంగా లయన్ కొత్తపల్లి రాంబాబు మాట్లాడుతూ, ప్రతి లయన్స్ క్లబ్ తమ పరిధిలో డయాబెటిస్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మధుమేహాన్ని ముందుగానే గుర్తించేందుకు ఈ డిటెక్షన్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీజీ లయన్ లింగా రెడ్డి, లయన్ జైపాల్ రెడ్డి (డీసీటీ), లయన్ కమలాకర్ (డీసీసీ), లయన్ బాలచందర్ చందర్ గౌడ్ (జీఎస్టీ కోఆర్డినేటర్), లయన్ తారకేష్, లయన్ చి. వెంకట రామరాజు, లయన్ ఎం. మోహన్, వివిధ క్లబ్‌లకు చెందిన రీజినల్ అధ్యక్ష కార్యదర్శు కోశాధికారులు,చైర్మన్లు (ఆర్ సిలు), జోన్ చైర్మన్లు (జెడ్ సిలు), లు, క్లబ్ పదాధికారులు మరియు లయన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియగా, జిల్లా వ్యాప్తంగా మధుమేహ నియంత్రణ, ముందస్తు నిర్ధారణ ప్రజారోగ్య పరిరక్షణలో లయన్స్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

### సర్ ప్రక్రియలో చురుగ్గా కాంగ్రెస్ నేతలు పాల్గొనాలి



మహేష్‌గౌడ్‌ను కలిసిన దేవ భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 11 ప్రభాతవార్త:** సర్ ప్రక్రియ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని నియోజకవర్గంలోని ఓటర్లకు సహాయ సహకారాలు అందిస్తున్నారని టీపీసీసీ సభ్యుడు మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం నియో జకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు కార్యక్రమంపై ఆయనను శనివారం కలిసి భాస్కర్ రెడ్డి సర్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డిమాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పరంగా చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమ ప్రగతిని, క్షేత్రస్థాయిలో సాధించిన విజయాలను వివరించడం జరిగిందన్నారు. సర్ ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లినందుకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కెఎల్ఆర్, బూత్ ఇన్‌ఛార్జ్‌లను, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులను టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకంగా అభినందిం చినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

### కాలభైరవస్వామి ఆలయం నిర్మాణానికి ప్రణాళికలు



శ్రీ కాలభైరవస్వామి ఆలయం నిర్మాణంపై స్థపతి వల్లినాయర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జులై 11 ప్రభాతవార్త :** ఉప్పల్ బాగాయత్‌లోని శ్రీ కాలభైరవ స్వామి దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయర్ స్థపతితో కలిసి ఆలయ నిర్మాణ ప్రణాళికలు, శిల్పకళా నమూనాలు, వాస్తు అంశాలు, నిర్మాణ విధానం తదితర అంశాలపై ఆలయంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ కాలభైరవ స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా, సాంప్రదాయ దేవాలయ నిర్మాణ శైలికి ప్రతీకగా నిలిచేలా అత్యున్నత ప్రమాణాలతో నిర్మించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా ప్రారంభించి, భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.